




శ్రీశైలంలో పాగాలంకరణ దృశ్యం



పరమశివుడికి పాగాలంకరణ

- వైభవంగా ఆది దంపతుల కల్యాణం
- నేత్రపర్వంగా మహా శివరాత్రి ఉత్సవాలు
- శ్రీగిరికి పోటెత్తిన భక్తులు

నంద్యాల, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి) : శ్రీగిరిలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి 10 గంటలకు ఆలయ ప్రధాన పూజారులు లింగోద్భవకాల మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ప్రారంభించారు. శివరాత్రి నాడు శ్రీశైలంలోనే ఉండే విశేషం ఆచారం మల్లన్న పాగాలంకరణ కార్యక్రమాన్ని పృథ్వీ వెంకటేశ్వర్లు తనయుడు సుబ్బారావు చేపట్టారు. రుద్రాభిషేకం అనంతరం అర్ధరాత్రి మల్లన్న, భ్రమరాంబికాదేవి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. వీటితోపాటు ప్రభోత్సవం, నంది వాహన సేవ ఘనంగా జరిగింది. మహాశివరాత్రి నేపథ్యంలో భక్తులు, శివమాలధారులతో శ్రీశైలం కిక్కిరిసింది.

వైభవంగా పాగాలంకరణ

వివాహ సమయాల్లో పెళ్లి కుమారుడికి తలపాగా చుట్టడం అందరికి తెలిసిందే. అట్లాగే మహాశివరాత్రి ంలో జు శ్రీశైల మల్లికార్జునుడిని పెళ్లి కుమారుడిగా ముస్తాబు చేయడంలో భాగంగా పాగాలంకరణ చేస్తారు. 365 మూరల పాగాను గర్భాలయ విమాన శిఖరం నుంచి ముఖ మండపంపైన ఉన్న నందులకు అనుసంధానిస్తూ తలపాగాను తలపించేలా ముస్తాబు చేశారు. ఎంతో నియమ నిష్ఠలతో బాపట్ల జిల్లా చీరాల మండలం హస్తినాపురం గ్రామానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు కుటుంబం ఏడాది పాటు నేసిన వస్త్రాన్ని ఇతర ప్రాంతాల నుంచి భక్తులు నేసిన వస్త్రాలను కలిసి పాగాలంకరణకు వినియోగించారు.

కమనీయం.. కల్యాణం

భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్ల ప్రభోత్సవ కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణోత్సవంలో స్వామి వారు పట్టువస్త్రాలను ధరించి, తలపై ఒకవైపు గంగమ్మను, మరోక వైపు నెల వంకను, మెడలో రుద్రాక్ష మాలను, నుదట విభూది రేఖలతో పెండ్లి కుమారుడిగా ముస్తాబయ్యారు. భ్రమరాంబ దేవి పట్టు వస్త్రాలను ధరించి, నుదట కల్యాణ తిలకాన్ని, బుగ్గన చుక్కను, సూర్యాభరణాలను ధరించి పెళ్లి కూతురిగా తయారయ్యారు. స్వామి, అమ్మ వారు అర్ధరాత్రి 12 గంటలకు వెండి పల్లకిలో పెండ్లి మండపానికి చేరుకున్నారు. నుదుట భాషికం కట్టి, తిలకం దిద్ది, కస్తూరి జవ్వాజి సుగంధ పరిమాళాలతో పెండ్లి పీటలపై ఆశీనులయ్యారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం చూసి భక్తులు పరవశించిపోయారు.

మహా రుద్రాభిషేకం


మహా శివరాత్రిని పురస్కరించుకుని రాత్రి 10 గంటల నుంచి స్వామి అమ్మ వార్లకు లింగోద్భవకాల మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. వేద పండితులు.. ఎంతో నిష్టాతులైన 11మంది అర్చకులచే ఆలయ ప్రాంగణంలోని పవిత్రమైన మల్లికాగుండంలోని జలాలు, పంచామృతాలు, పలు ఫలోదకాలతో అభిషేకం జరిపించారు

నంది వాహన సేవ

ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో నందివాహన సేవను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలతో హారతులు ఇచ్చి నంది వాహనంపై కొలువైన ఆది దంపతులను ఆలయ ప్రదక్షిణ చేయించి ఊరేగించారు. కళాకారులు నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు రథోత్సవం..

బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం మల్లికార్జున స్వామివారికి రథోత్సవం నిర్వహిస్తారు. మధ్యాహ్నం నుంచి పూజలు ప్రారంభమవుతాయి. రథశాల వద్ద రథాంగపూజలు, రథాంగహోమం జరిపి తదుపరి స్వామిఅమ్మవార్ల రథోత్సవం నిర్వహిస్తారు.







క్యూలైన్ లో భక్తులు



స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు



భక్తుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఈవో





భక్తజన సంద్రం మధ్య ప్రభోత్సవం



అర్ధరాత్రి 12:30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం



పాతాళగంగ వద్ద భక్తుల స్నానాలు



దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పాగాను తీసుకొస్తున్న పృథ్వీ కుటుంబ సభ్యులు



నృత్య ప్రదర్శన



ప్రభోత్సవం



గంట మోగిస్తున్న భక్తులు



ప్రభోత్సవం ముందు కళాకారుల విన్యాసాలు



మహిళల కోలాటం



నందివాహన సేవ నిర్వహిస్తున్న అధికారులు, అర్చకులు



శంఖం పూరిస్తున్న సాధువులు

దద్దనాల ఎత్తిపోతలను ప్రారంభించిన మంత్రి బీసీ



నీటి పంపింగ్ మోటార్లను ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ

- రూ.25.75 లక్షలతో మోటార్లకు మరమ్మతులు
- ఎస్సార్బీసీ నీరు విడుదల

బనగానపల్లె , ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దద్దనాల ప్రాజెక్టును రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తిరిగి ప్రారంభించారు. బుధవారం రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ మోటార్లు అన్ చేసి ఎస్సార్బీసీ నీటిని జుర్రేరు ఎత్తిపోతల పథకం ద్వారా దద్దనాల ప్రాజెక్టుకు నీరు విడుదల చేసి పడమటి పల్లెలకు అంకితం చేశారు. ప్రభుత్వం వద్ద నిధుల కొరత ఉండడంతో మంత్రి బీసీ సొంత డబ్బు 25.75లక్షలు వెచ్చించి గత వైసీపీ ప్రభుత్వంలో తుప్పుపట్టిపోయి, పాడైపోయి మూలన పడ్డ నాలుగు మోటార్లకు మరమ్మతులు చేయించారు. ఎస్సార్బీసీ కాల్వ ద్వారా ఏర్పాటు చేసిన జుర్రేరు ఎత్తిపోతల పథకం నుంచి దద్దనాల ప్రాజెక్టుకు నాలుగు మోటార్లు ఆన్ చేసి నీరు విడుదల చేసి ఎన్నికల్లో ఇచ్చిన మాటను మంత్రి నిలబెట్టుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జుర్రేరు ఎత్తిపోతల పంప్‌హౌస్ వద్ద విలేఖర్లతో మాట్లాడుతూ సుమారు 28 గ్రామాలకు సాగు, తాగు నీరు అందించాలనే ఉద్దేశంతో గతంలో టీడీపీ ప్రభుత్వహయంలో రూ.21 కోట్లతో జుర్రేరు ఎత్తిపోతల పథకాన్ని తాను ఎమ్మెల్యేగా పూర్తి చేయించా అని గుర్తు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్ల జుర్రేరు ఎత్తిపోతల పథకాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నిర్లక్ష్యం ఖరీదు అక్షరాలా రూ.25.75 లక్షలని అన్నారు. ఎస్సార్బీసీలో నీరు ఉన్నంత కాలం దద్దనాల ప్రాజెక్టుకు నాలుగు పంపుల ద్వారా నీరు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డి, తిరుమలయ్య, బాలనాయుడు, భూషన్న, శంఖేశ్వరరెడ్డి, రంగస్వామి, సంగు శ్రీనివాస రెడ్డి, గాలి మధుసూదన్‌రెడ్డి, ఐడీసీ ఏఈ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

గురు వైభవోత్సవాలకు రండి

- మంత్రి నారా లోకేశ్‌కు శ్రీమఠం ఆహ్వానం
- మార్చి 1న పర్యటన ఖరారు

మంత్రాలయం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాలకు ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కు శ్రీమఠం అధికారులు ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, సూపరింటెండెంట్ అనంతపురాణిక్ ఆహ్వానపత్రికను అందజేశారు. బుధవారం మంత్రి లోకేశ్ నివాసంలో కలిసి గురుభక్తి ఉత్సవాలకు రావాలిన ఆహ్వానించారు. దీంతో మార్చి 1న ఉత్సవాలు ప్రారంభమయ్యే రోజు రాఘవేంద్రస్వామి 404 పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు అమరావతి నుంచి హెలికాప్టర్ ద్వారా ఉదయం 10 గంటలకు మంత్రాలయం చేరుకుని రాఘవేంద్రస్వామిని దర్శించుకుని గురు వైభవోత్సవ-2025 అవార్డును పీఠాధిపతి చేతుల మీదుగా అందుకుంటారని మఠం అధికారులు తెలిపారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో ఫోన్ ద్వారా మాట్లాడించారు. మంత్రి లోకేశ్ పర్యటన ఖరారు కావడంతో హెలిప్యాడ్ మైదానం, వసతి, దర్శనం, భద్రతా ఏర్పాట్లు, అవార్డు ప్రదానానికి ఏర్పాట్లులో పోలీసు రెవెన్యూ శ్రీమఠం అధికారులు నిమగ్నమయ్యారు.



దీంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి వేర్వేరుగా తమ నాయకులతో సమావేశమై లోకేశ్ పర్యటనను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు.

నేడు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ రాక

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సాహెబ్ పర్యటించనున్నారని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పర్వీన్ బుధవారం తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిశీలన, ఉమర్ అరబిక్ స్కూల్ సందర్శన, టీచర్స్‌తో సమావేశం, మైనార్టీ మహిళలు టైలరింగ్‌లో శిక్షణ తీసుకున్న వారికి ధృవీకరణ పత్రం అందజేస్తారని అన్నారు.

నంది వాహనంపై మహా నందీశ్వరుడు 7

సురభి నాటకాలకు ప్రోత్సాహకాలు అందించాలి 7

పదోన్నతులకు మోక్షమెన్నడో...?
- తుది సీనియారిటీ జాబితాల రూపకల్పనలో ఎడతెగని జాప్యం

7

నంది వాహనంపై మహో నందీశ్వరుడు





మహానందిలో నంది వాహనంపై విహరిస్తున్న మహో నందీశ్వరుడు

శివరాత్రి సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం



మహానంది, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహానందిలో శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి స్వామివారికి నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయాలతో పాటు యాగశాల మంటపంలో ఉదయం నుండి వేదపండితులతో పాటు ప్రత్యేక బుత్వికులు గణపతి పూజ, పుణ్యాహ వచనం, త్రిశూల చండీశ్వరార్చన, దీక్షా కంకణధారణలను వేదమంత్రాలతో నిర్వహించారు మధ్యాహ్నం అంకురార్పణ, కలశ స్థాపన, అఖండ దీప ప్రతిష్ఠతో పాటు అగ్నిముఖం పూజలను జరిపారు. అనంతరం ఉదయం 11 గంటల నుండి రావణ వాహనంపై ఉత్సవమూర్తుల విగ్రహాలను ఆశీనులు గావించారు. అనంతరం ఆలయ వీధుల గుండా గ్రామోత్సవం జరిపారు. ఉత్సవం ముందు కోలాటం నృత్యం, శివతాండవం నృత్యాలు పలువురిని ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి, ఏఈఓ యర్రమల్ల మధుతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



మహానందిలో పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న టీటీడీ ఏఈవో మోహన్‌రాజు

ఘనంగా లింగోద్భవ కాల పూజలు

మహానందిలో శివరాత్రి ఉత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన లింగోద్భవ పూజలను బుధవారం రాత్రి 10 గంటల నుండి ప్రధాన గర్భాలయంలో వేదపండితులు పరమశివునికి లింగోద్భవ పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డితో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణం కన్నుల పండువగా జరిపారు.

టీటీడీ తరపున పట్టు వస్త్రాలు సమర్పణ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే స్వామి వారి కల్యాణానికి టీటీడీ దేవస్థానం పట్టు వస్త్రాలు పంపారు. బుధవారం మహానందికి పట్టు వస్త్రాలతో చేరుకొన్న టీటీడీ ఏఈఓ మోహన్‌రాజుకు ఆలయం ముఖ మంటపం వద్ద ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో పట్టు వస్త్రాలను సమర్పించారు.

భారీ జనసందోహం:

శివరాత్రి ఉత్సవాలను తిలకించేందుకు వేలాదిమంది భక్తులతో మహానంది పోటెత్తింది. బుధవారం ఉదయం నుండి రాత్రి వరకు తెలుగు రాష్ట్రాల నుండే కాక ఇతర ప్రాంతాల నుండి భక్తులు దర్శనం కోసం తరలి వచ్చారు. ముందుగా ఆలయ రెండో ప్రాకారంలోని కోనేర్లలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు నంద్యాల భాష్యం స్కూల్, యూనియన్ బ్యాంకు, ఆంధ్ర ప్రగతి బ్యాంకు, జిందాల్ సంస్థ మజ్జిగ, తాగునీరు అందజేసారు. రాత్రి జాగరణ కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



క్యూలైన్‌లో భక్తులు

కర్ణాటక మద్యం పట్టివేత

● బైకు స్వాధీనం

● ఒకరి అరెస్టు, పరారీలో మరొకరు



కర్ణాటక మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కోడుమూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కోడుమూరు ఎక్సైజ్ పరిధిలోని క్రిష్ణగిరిలోని ఒక క్వారీ దగ్గర డంప్ చేసి పెట్టిన కర్ణాటక మద్యాన్ని బుధవారం ఉదయం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి పట్టుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో సీఐ మంజుల మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు క్రిష్ణగిరిలో దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడిలో కర్ణాటకకు చెందిన 40 బ్యాక్సులో ఉన్న రూ.1.60 లక్షల విలువ గల 3840 ఒరిజినల్ ఛాయిస్ 90ఎంఎల్ ప్యాకెట్లను పట్టుకున్నామని తెలిపారు. కర్ణాటక మద్యాన్ని దిగుమతి చేసుకొని విక్రయిస్తున్న క్రిష్ణగిరికి చెందిన నిందితుడు లోకేష్‌ను అరెస్టు చేసి అతడి నుంచి మద్యం బాక్సులు, బైక్‌ను స్వాధీనం చేసుకొన్నామన్నారు. తుగ్గలి మండలానికి చెందిన మరో నిందితుడు రాజేంద్ర పరారీలో ఉన్నాడని, త్వరలో అతడిని కూడా పట్టుకుంటామని అన్నారు. క్రిష్ణగిరి మండలంలో దేవరలు ఉండటం వలన కర్ణాటక నుంచి మద్యం దిగుమతి చేసుకొని విక్రయిస్తున్నారని సమాచారం మేరకు దాడులు చేశామని ఆమె తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ చంద్రమోహన్, హెడ్ కానిస్టేబుల్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నన్నూరు విద్యుత్ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారిపైన మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం శ్రీనగర్ కాలనీకి చెందిన పుల్లారెడ్డి కుమారుడు శంకర్ రెడ్డిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కొంత కాలంగా మండల పరిధిలోని కన్నమడకల గ్రామంలో నివసిస్తున్నాడని మృతుని తల్లి తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రామళ్లకోట సమీపంలో...

వెల్దుర్తి, వెల్దుర్తి టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల పరిధిలోని రామళ్లకోట గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనాథ్ (23) అనే యువకుడు మృతి చెందాడు. శ్రీనాథ్ రామళ్లకోట గ్రామానికి చెందిన గంజి బలరామ్ కుమారుడు. యువకుడు లారీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రామళ్లకోట గ్రామ సమీపంలో సిల్కాన్ ఇసుక లారీ బిల్లులను అందించి బైక్‌పై తిరిగి వస్తుండగా.. స్థానిక పెద్దమ్మ దేవాలయం వద్ద బొలేరో వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలు కాగా, స్థానికులు 108 వాహనంలో వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి వివాహం కాలేదు.

ముగ్గురు నిందితుల అరెస్టు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల పట్టణానికి చెందిన హరిణి ఆత్మహత్య కేసులో నిందితులైన భర్త సాదిక్ హుసేన్, అత్త మహబూబ్‌బీ, మామ జాఫర్‌హుసేన్‌లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. హరిణి, సాదిక్‌హుసేన్‌లది ప్రేమ వివాహం. భర్త, అత్తమామలు వేధిస్తున్నారని హరిణి ఆదివారం ఆత్మహత్య చేసుకుందని ఆమె సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదు చేశాడ. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి కోవెలకుంట్ల కోర్టులో హాజరుపరచగా జడ్జి మహబూబీని కర్నూలు సబ్ జైలుకు, సాదిక్‌హుసేని, అతని తండ్రి జాఫర్‌హుసేన్‌ను ఆళ్లగడ్డ సబ్‌జైలుకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

దుర్గా భోగేశ్వరంలో కొండచిలువ

గడివేముల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలోని ప్రథమ కోనేరులో బుధవారం కొండచిలువ హల్‌చల్ చేసింది. భక్తులు కోనేర్లలో స్నానాలు చేసేందుకు వెళ్లగా కొండ చిలువ కనపడటంతో ఆలయ ఈవో రామానుజన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. కొండచిలువను పట్టుకొని గని రిజర్వ్ ఫారెస్టులోని పెద్దెద్దులబిల లోయలో వదిలారు. ఫారెస్టు బీట్ అధికారి అబ్దుల్‌కలామ్ పాల్గొన్నారు.

యాగంటిలో మంత్రి బీసీ దంపతుల పూజలు

భక్తులకు రూ.7లక్షల లడ్డు ప్రసాదాలు పంపిణీ చేసిన మంత్రి




ఉమా మహేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ



ఉమా మహేశ్వరస్వామికి పూజలు చేస్తున్న మంత్రి బీసీ దంపతులు

బనగానపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఎర్రమల్ల కొండల్లో వెలసిన ప్రముఖ శైవక్షేత్రం యాగంటి శివనామస్మరణతో మారుమోగింది. ఉమామహేశ్వర స్వామి వార్ల దర్శనార్థం భక్తులు బుధవారం వివిధ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం 5 గంటలకు స్వామివార్లకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఏపీలోని పలు జిల్లాల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలి రావడంతో యాగంటి క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది.

● యాగంటిలో రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు ఉమామహేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. బీసీ దంపతులకు ఆలయ ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి, పూజారులు, భక్తులు, ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వారు ఉమామహేశ్వరస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రి రూ.7లక్షల సొంత డబ్బుతో భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదాలు అందించారు.



కోనేరులో స్నానం ఆచరిస్తున్న భక్తులు



క్యూలైన్‌లో భక్తులు

బ్రహ్మోత్సవాల్లో నంది రాజసం



ఉత్సవాల్లో రాజసంగా నడుస్తున్న నంది

శ్రీశైలం (కోడుమూరు రూరల్), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శివుడి వాహనం నంది. శ్రీగిరిలో మాఘంలో వచ్చే మహాశివరాత్రికి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. సుమారు 11 రోజులపాటు మల్లికార్జున సమేత భ్రమరాంబికా దేవి వేడుకలు తిలకించడానికి లక్షల సంఖ్యలో భక్తులు హాజరవుతారు. బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లకు వివిధ సేవలను పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణలో ఊరేగిస్తారు. వాహన సేవలలో మల్లన్న వాహనం నందీశ్వరుడు పల్లకి ముందు రాజసంగా నడుస్తుండగా వెనుకనే వివిధ కళారూపాలు ప్రదర్శనలు జరుగుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఏడాదికోమారు వచ్చే స్వామి, అమ్మవార్ల కల్యాణంలో నందివాహనం ప్రధాన భూమిక పోషిస్తోంది. స్వామి సేవకుడిగా మల్లన్న పెళ్లి క్రతువులో నందిరాజసం మహా అద్భుతం.

దర్శనానికి 6 గంటల సమయం



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలం (కోడుమూరు రూరల్), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శ్రీగిరి బుధవారం భక్తులతో నిండిపోయింది. బ్రహ్మోత్సవ వేడుకలు తిలకించడానికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. దీంతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయానే ఉచిత క్యూలైన్ నందిమండపం సమీపం వరకు చేరుకుంది. ఒకవైపు మల్లన్నస్వామి, భ్రమరాంబదేవి దర్శనం చేసుకుని వస్తుండగా, మరోవైపు దర్శనం వచ్చే భక్తులు క్యూలైన్లకు చేరారు. దీంతో స్వామిఅమ్మవార్ల దర్శనం సుమారు ఆరుగంటల సమయం తీసుకుంది. క్యూలైన్లలో మహిళలు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడ్డారు. కొందరు క్యూలైన్లలో కింద కూర్చుండిపోయారు. ఇంకా లడ్డూ కౌంటర్లన్నీ కిటకిటలాడాయి. అడిగినన్ని లడ్డూలను విక్రయించారు.

పదోన్నతులకు మోక్షమెన్నడో?

• సీనియారిటీ తుది జాబితా రూపకల్పనలో ఎడతెగని జాప్యం

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతుల మాటంటే ఎండమావిలో నీటి జాడను అన్వేషించినట్లే. కానీ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పరిపాలనా విధానం రూపురేఖలు మారుతున్నాయి. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలను పవన్ కళ్యాణ్ తీసుకోవడంతో ఈ శాఖకు ఎనలేని ప్రాధాన్యం ఏర్పడింది. ఎన్నో ఏళ్లుగా పదోన్నతులు లేకుండా ఉసురుమంటున్న పంచాయతీ కార్యదర్శులకు పవన్ కళ్యాణ్ వరాల జల్లు ప్రకటించారు. గత ఏడాది నవంబరు 30లోగా పదోన్నతులు కల్పించాలని ఆదేశించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా అన్ని జిల్లాలోనూ గ్రేడ్-1 నుంచి గ్రేడ్ 5 వరకు ఉన్న పంచాయతీ కార్యదర్శుల సీనియారిటీ జాబితాలు రూపొందించాలని ఉత్తర్వులు వెలువడ్డాయి.

పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-1, 2 జోనల్ స్థాయి పరిధిలోని వస్తాయి. కాబట్టి వారి సీనియారిటీ జాబితా కమిషనరేట్‌లో రూపొందిస్తారు. కాగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-3, 4, 5 వారి సీనియారిటీ జాబితాను జిల్లా పంచాయతీ అధికారి వారి కార్యాలయం రూపొందిస్తుంది. ఈ మేరకు ముసాయిదా సీనియారిటీ జాబితాను రూపొందించారు. అయితే అందులో అనేక తప్పులు దొర్లాయి. అభ్యంతరాలకు అవకాశం ఇచ్చి త్వరితగతిన తుది జాబితాను రూపొందించాల్సిన పని నత్తనడకన కొనసాగుతోంది. ఇటీవల జిల్లాలో గ్రామ, రెవెన్యూ అధికారుల పదోన్నతులు పూర్తికాగా పంచాయతీ కార్యదర్శుల పదోన్నతి దస్త్రం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. డీపీవో కార్యాలయ దిగువస్థాయి సిబ్బంది అనుభవరాహిత్యం, అవగాహన లేమితో తప్పులు దొర్లడంతో పంచాయతీ కార్యదర్శులతో నిరభ్యంతర పత్రాలను సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియ ఎప్పుడు కొలిక్కి వస్తుందో తెలియక పంచాయతీ కార్యదర్శులు అగమ్యగోచర పరిస్థితుల్లో ఉన్నారు.



ఇక గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి త్రిశంకుస్వర్గంలో మాదిరిగా ఉంది. జగన్ సర్కార్ వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చి మూడేళ్లపాటు రూ.15వేలుకు పని చేయించారు. వారికి మూడు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాల్సి ఉండగా.. జగన్ సర్కార్ మొండి చేయి చూపించింది. దీంతో వారు అతి తక్కువ పేస్కేల్‌తో పని చేస్తున్నారు. గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శుల కన్నా 6 ఇంక్రిమెంట్లు వెనుకబడి ఉన్నారు. కూటమి సర్కార్ ఈ తప్పిదాన్ని సరి చేస్తుందని వారు ఆశాభావంతో ఉన్నారు. కనీసం పదోన్నతి లభిస్తే తమ జీతాలు మెరుగై తమ జీవితాలు బాగుపడుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సురభి నాటకాలకు ప్రోత్సాహకాలు అందించాలి

● శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శతాబ్దాల చరిత్ర ఉన్న సురభి నాటక రంగానికి ప్రోత్సాహకాలు అందించాలని శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ కొండయ్య అన్నారు. శివరాత్రి పర్వదిన సందర్భంగా బుధవారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో సురభి కళాకారుల నాటకం బాలనాగమ్మ ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి నాటకాన్ని ప్రారంభించారు. కొండయ్య మాట్లాడుతూ ఒకనాడు సురభి నాటకాలకు పెట్టింది పేరని, సినిమాను మించిన సాంకేతిక నిపుణతలతో రంగస్థలంపై వారు ప్రదర్శించే విన్యాసాలు అబ్బురపరిచే విధంగా ఉంటాయని అన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ సురభి కళాకారులను ప్రోత్సహించే దిశగా రెండు రోజుల పాటు వారి నాటక ప్రదర్శనలు కళాక్షేత్రంలో ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా సురభి సంస్థ నిర్వాహకుడు సురభి సంతోష్‌ను సత్కరించి, నగదు పారితోషికం అందజేశారు. టీజీవీ కళాక్షేత్రం సభ్యులు లక్ష్మీకాంతరావు, పాండురంగయ్య, యాగంటీశ్వరప్ప, క్రిష్టఫర్, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. గురువారం రాత్రి 7 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో పాతాళభైరవి సురభి నాటకం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అలరించిన బాలనాగమ్మ నాటకం

హైదరాబాదుకు చెందిన సాయి సంతోషి సురభి నాటక మండలి ఆధ్వర్యంలో 50 మందికి పైగా కళాకారులు ప్రదర్శించిన బాలనాగమ్మ నాటకం ఆసాంతం ప్రేక్షకులను అలరింపజేసింది. సుమారు మూడున్నర గంటల పాటు ఈ నాటకాన్ని భారీ సెట్టింగులతో, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రదర్శించారు. బాల నాగమ్మను మాయలఫకీరు మాయం చేసే విధానం, ఫకీరు గుహలో వెలిగి ఆరిపోయే కొవ్వొత్తులు చూసి ప్రేక్షకులు హర్షధ్వానాలు చేశారు.



కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

జీవో విడుదల చేసే వరకు పోరాటం ఆగదు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లైస్ హమాలీలకు కొత్త కూలి రేట్ల జీవోను విడుదల చేసే వరకు పోరాటం ఆగదని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణ అన్నారు. కొత్త కూలి రేట్లను విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ధర్నా చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణ హాజరై మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి రాజశేఖర్, యూనియన్ జిల్లా కార్యదర్శి బజారి సోల్మాన్‌రాజు, ఆర్. చంద్ర, శివ, వినయ్ పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గలో మహాశివరాత్రి సందర్భంగా గురువారం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు, నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి నుంచి వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20 వేలు, రూ.10వేలు, రూ.6వేలు, రూ.3 వేలు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించాలన్నారు.

● కాల్వబుగ్గలో అంత ర్రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు గురువారం నిర్వహించన్నుట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదును అందజేయన్నట్లు తెలిపారు.

క్రీడాకారిణికి టీజీ అభినందన


సియానా డాల్సిని అభినందిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి డ్యాన్స్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో కర్నూలు నగరానికి చెందిన సియానా డాల్సి ప్రతిభ కనబరచడం అభినందనీ యమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. బుధవారం నగరంలోని హోటల్ మౌర్యఇన్ కాంప్లెక్స్‌లో ఉన్న తన చాంబరులో సియానా డాల్సినికి ఆయన ప్రశంసాపత్రం అందజేసి శాలువతో సన్మానించారు.

స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయాలి


కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న ఏపీ ఎన్జీవోస్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయాలని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్ రెడ్డి అన్నారు. ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్ రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్న, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లీలావతి, బంగారి, వెటర్నరీ ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్ల అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా కలెక్టరేట్ ప్రాంగణం

● మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక అవస్థలు

● మూడు నెలలుగా పని చేయని లిఫ్టు


పార్కులో సంచరిస్తున్న పందులు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రాంగణం అపరిశుభ్రంగా తయారైంది. కలెక్టరేట్ కార్యాలయం పరిధి లోని పనిచేస్తున్న సచివాలయ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కనీసం పరిశుభ్రతపై తనిఖీ పర్యవేక్షణ కూడా చేయడం లేదని ఆరోపణలున్నాయి. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి తమ సమస్య పరిష్కారాల కోసం కలెక్టర్ కార్యాలయానికి ప్రజలు వస్తున్నారు. కనీసం మూత విసర్జన చేయడానికి మూత్రశాలలు, మరుగు దొడ్లు లేక ప్రజలు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. కలెక్టరేట్‌లోని ఉన్న లిఫ్టు దాదాపు మూడు నెలలుగా పని చేయడం లేదు. వివిధ పనుల నిమిత్తం ఇక్కడకు వస్తున్న దివ్యాంగులు రెండు, మూడో అంతస్తుల మెట్లు ఎక్కడానికి ఇబ్బంది పడుతున్నారు. కలెక్టర్ స్పందించి చెత్తకుండీలు ఏర్పాటు చేయాలని, మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

శివనామస్మరణతో మార్మోగిన కాల్వబుగ్గ

● భారీగా తరలివచ్చిన భక్తులు

● స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు



కాల్వబుగ్గలో శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు, జగన్నాథ గట్టుపై పూజలు చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత దంపతులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వ రస్వామి క్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా భక్తులతో రామేశ్వరస్వామి ఆలయం కిటకిటలాడింది. అంతకు ముందు కాల్వ గ్రామం నుంచి ఉత్సవమూర్తులను మేళతాళాలు, నందికోల సేవతో కాల్వబుగ్గ క్షేత్రానికి పల్లకిలో తీసుకువచ్చారు. భక్తులు స్వామి, అమ్మ వార్లను దర్శించుకుని అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ సీనియర్ నాయకుడు గౌరు వెంకటరెడ్డి, గౌరు తనయుడు జనార్ధన్‌రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ ఆయన సతీమణి జ్యోతి స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ ఈవో మద్దిలేటి, ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, కల్లె లక్ష్మీనరసింహ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం, లింగాయత్‌ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని మల్లెల రాజశేఖర్ ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వాటర్ ప్యాకెట్లు భక్తులకు పంపిణీ చేశారు. మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ బండి భక్తులను ఆకట్టుకుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, రామాంజనేయ శర్మ, పెద్ద మల్లయ్య, ఎం.లక్ష్మీదేవి, మాశపోగు వరలక్ష్మి, తెలుగు లక్ష్మీదేవి, ప్రభావతమ్మ, పద్మావతమ్మ, మాతృనాయక్, ఆయా గ్రామాల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

● మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, హుశేనాపురం, ఎన్.కొంతలపాడు, శకునాల, సోమయాజులపల్లె తదితర గ్రామాల్లో శివరాత్రి సందర్భంగా శివాలయాల్లో స్వామి వారికి మహిళలు, భక్తులు కాయకర్పూరాలు సమర్పించారు. కార్యక్ర మంలో ఈవో చంద్రశేఖర్ రెడ్డి, భక్తులు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, కేవీ మధు, బజారు, వేణు, సుధాకర్, రామగోవిందు పాల్గొన్నారు.


కాల్వ నుంచి కాల్వబుగ్గకు వచ్చిన ఉత్సవమూర్తులను పల్లకిలో తీసుకెళ్తున్న భక్తులు


కాల్వబుగ్గలో స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో నిలబడిన భక్తులు


హరిహర క్షేత్రంలో..


జగన్నాథ గట్టుపై..


కాల్వబుగ్గలో మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మల్లెల రాజశేఖర్


కలశాలతో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

నగరంలో శివరాత్రి వేడుకలు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం నగరంలోని వివిధ ఆలయాలకు భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే క్యూలైన్లలో నిల్చుని స్వామివారి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

జగన్నాథ గట్టుకు పోటెత్తిన భక్తులు: నగర శివారులోని జగన్నాథ గట్టుపై వెలసిన రూపాల సంగమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. జగన్నాథగట్టు అభివృద్ధి సమితి, దేవాదాయ శాఖ, దిన్నెదేవరపాడు గ్రామపంచాయతీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వాహ కులు భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని క్యూలైన్లు, బారికేడ్లు, అన్నప్రసాద పంపిణీ అభివృద్ధి సమితి ప్రతినిధులు పి. నరసింహారెడ్డి, మల్లికార్జున రెడ్డి, ఎస్. శ్రీనివాసరెడ్డి, ఇతర సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. బుధవారం ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సురేశ్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి భక్తులు స్వయంగా క్షీరాభిషేకం చేసేలా ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు టీడీపీ నాయకుడు, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ పెరుగు పురుషోత్తమరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో అన్నప్రసాదం పంపిణీ చేశారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ వేళ స్వామివారికి నిర్వహించిన అభిషేక కార్యక్రమంలో వందలాది భక్తులు పాల్గొన్నారు. గురువారం వేకువ జామున 3 గంటలకు శివపార్వతుల కల్యాణం, స్వామివారి ప్రాకార పల్లకి సేవ నిర్వహిస్తారు. ఆలయ ఈవో గుర్రెడ్డి, దేవస్థానం సిబ్బంది సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శివరాత్రి పూజలు కొనసాగించారు. ఈ పూజలకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి దంపతులు హాజరై పూజలు నిర్వహించారు. అలాగే కర్నూలు నగరానికి చెందిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.

● **హరిహర క్షేత్రంలో :** నగరంలోని సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలోని భవానీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రాతఃకాలం నుంచీ రుద్రాభిషేకాలు ప్రారంభించారు. అర్ధరాత్రి రాత్రి లింగోద్భవ కాలంలో భక్తులచే అభిషేకాలు ఏర్పాటు చేశారు. బ్రాహ్మణ సంఘం నగర అధ్యక్ష కార్యదర్శులు సండేల్ చంద్రశేఖర్, చల్లా నాగరాజ శర్మ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సతీమణి టీజీ రాజ్యలక్ష్మి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రముఖ వైద్య నిపుణుడు డబ్ల్యూ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

● గుత్తిరోడ్డులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో గౌరీ శంకర స్వామికి విశేష పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. నవగ్రహ, లక్ష్మీగణపతి, మూలమంత్ర సహిత అఘోర పాశుపత, లలితా సహస్రనామ హోమాలు చేశారు. రాత్రి లింగో ద్భవ సమయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేపట్టారు.

● బళ్లారి చౌరస్తారోడ్డులోని వాసవీనగర్‌లోగల శివాలయంలో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని ఉమా సహిత మహేశ్వర స్వామి వారికి ప్రత్యేక పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులతో ఊరేగింపు నిర్వహించారు.

● సప్తగిరినగర్‌లోని కైలాసగిరి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు చేపట్టారు. నగరేశ్వర ఆలయంలో శివరాత్రి సందర్భంగా స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, స్వామి, అమ్మవార్లకు కల్యాణం చేపట్టారు. బి.క్యాంపులోని శంకరమందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిదంబరరావు వీధిలోని శంకర మఠంలో కామాక్షి సహిత చంద్రమౌళీశ్వర స్వామికి పూజలు చేశారు. అశోక్‌న గర్‌లోని ఆంజనేయస్వామి, ద్వారకామాయి సాయిబాబా దేవస్థానంలోని శివాలయంలో, అశోక్‌నగర్ రోడ్డులోని మల్లికార్జున స్వామి దేవాలయంలో, అశోక్‌నగర్ కేసీ కెనాల్ సమీపంలోని శివరామాలయంలో, పాతనగరం లోని రంగరాజ వీధిలోని శివాలయంలో, జడ్పీలోని శివాలయంలో, కిసాన్ ఘాట్‌లోని సంగమేశ్వర ఆలయంలో బిల్వార్చనలు, కుంకుమార్చనలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు.

● **కుర్ని సంఘం ఆధ్వర్యంలో..** కల్లూరులోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలోని స్వామివారికి అభిషేకం నిర్వహించేందుకు సుమారు 200 మంది మహిళ లతో శోభాయాత్ర నిర్వహించారు. పందిపాడులోని రామాలయం నుంచి దీప, కలశాలతో, మేళతాళాలతో ఆరంభమైన శోభాయాత్ర కల్లూరులోని నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుర్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ గత 8 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగి స్తున్నామన్నారు. గౌరవాధ్యక్షుడు బి. అజయ్‌కుమార్, అధ్యక్షుడు బెండికే వాసుదేవయ్య మాట్లాడుతూ 144 ఏళ్లకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా జరిగే పవిత్ర మాసంలో వచ్చిన మహాశివరాత్రి పర్వదినం ఎంతో పవిత్ర మైందన్నారు. కార్యక్రమంలో నిర్వహణ కార్యదర్శి జగదీష్, సీబీ చంద్రశేఖర్, సత్య గడిగే ప్రసాద్, రాధాకృష్ణ, రామదాసు, కృష్ణ పాల్గొన్నారు.

వీహెచ్‌పీ మాతృశక్తి సంస్థ ఆధ్వర్యంలో.. నగరంలో హరిశ్చంద్ర శరీన్‌నగర్‌లోగల సద్గురు త్యాగరాజ సీతా రామాలయంలో మహా శివరాత్రి సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ అనుబంధ సంస్థ మాతృశక్తి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మహిళాలు సామూహిక శివరాత్రి పూజలు నిర్విహించారు. ఈ సందర్భంగా ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలను పోలుస్తూ దీపాలు వెలిగిం చారు. అలాగే ఆలయంలో లింగస్వరూపమూర్తి అయిన మహా శివునికి సామూహిక అభిషేకాలు, శివ పంచాక్షరీ మంత్ర జపాలు, అష్టోత్తర శతనా మావళి పఠనం చేశారు. అనంతరం సామూహిక దీపారాధనలు నిర్వహిం చారు. కార్యక్రమంలో మాతృశక్తి జిల్లా అధ్యక్షురాలు మాళిగి పావని, దుర్గా వాహిని సంస్థ కార్యకర్తలు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

శివ రామాలయంలో గౌరు దంపతులు పూజలు: నగరంలోని మాధవీ నగర్‌లోగల శివ రామాలయంలో బుధవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు నియోజిక వర్గం టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి దంపతు లు పూజలు నిర్వహించారు. ఆలయంలో లింగస్వరూపమూర్తి అయిన మహా శివునికి పంచామృతాభిషేకం నిర్వహించారు.

కమనీయం.. నీలకంఠేశ్వరుడి కల్యాణం

గూడూరు: మహాశివరాత్రి సందర్భంగా గూడూరులో భువనేశ్వరి, నీలకంఠేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. బుధవారం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, కుం కుమార్చనలు నిర్వహించారు. అనంతరం ప్రభోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పురోహితుడు నాగరాజు, నీలకంఠేశ్వరస్వామి భక్త బృందం పాల్గొన్నారు. అలాగే చనుగొండ్ల గ్రామంలో నాగలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణాన్ని జరిపించారు. అనంతరం ప్రభోత్సవం చేపట్టారు. గురువారం గూడూరు, చనుగొండ్ల గ్రామాల్లో రథోత్సవం నిర్వహించనున్నారు.


సంకల్‌బాగ్‌లో పూజలు చేస్తున్న టీజీ రాజ్యలక్ష్మి


జగన్నాథ గట్టుపై భక్తులకు అన్నప్రసాద పంపిణీ


రూపాల సంగమేశ్వరుడికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

చదువుల రామయ్య కాలనీలో సమస్యల తిష్ఠ

● తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ లేవు

● ఇబ్బందుల్లో ప్రజలు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని 20వ వార్డు చదువుల రామయ్య కాలనీలో సమస్యలు తిష్ఠ వేశాయి. ఈ కాలనీ ఏర్పడి సుమారు మూడేళ్లు అవుతున్న ఇక్కడ తాగునీరు, కరెంటు, రోడ్లు, డ్రైనేజీలు లేవు. కాలనీలో 350 గుడిసెలలో సుమారు 1000 మందికి పైగా జీవనం సాగిస్తున్నారు. రోజు కూలి పనులు చేసుకుని జీవనం సాగించే వారే ఎక్కు వ శాతం ఇక్కడ నివసిస్తున్నారు.

● **సదుపాయాలు నోచుకోని కాలనీ..**

కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, కరెంటు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు పాలకులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


విద్యుత్ స్తంభాలు లేక కర్రలపై తీసుకెళ్లిన తీగలు

● **అస్తవ్యస్తంగా రోడ్లు.. డ్రైనేజీ**

కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కాలనీ పక్కనే ఉన్న మల్లారెడ్డి వెంచర్ నుంచి మురుగునీరు ఇదే కాలనీలో ప్రవహిస్తోంది. దీంతో రోగాల బారిన పడుతున్నారు. వర్షం వచ్చిందంటే చాలు కాలనీ ప్రజలు ఇళ్లలోనుంచి బయటికి వెళ్లే పరిస్థితి లేదు. ప్రధాన రహదారి నుంచి ఈ కాలనీ సుమారు కిలోమీటరు దూరంలో ఉంది. దీంతో బయట నుంచి కాలనీలోకి రావాలంటే కూడా రోడ్లు లేవు. వర్షం వచ్చిందంటే నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో కాలనీ నుంచి ఒక్క కిలోమీటరు దూరానికి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి ఉంటోంది.

● **రాత్రి సమయంలో విషకీటకాలు..**

కాలనీలో కరెంటు లేకపోవడంతో రాత్రి సమయాల్లో పాములు, తేళ్లు, జెర్రిపోతులు సంచరిస్తుంటాయి. రాత్రి ఏడు గంటలు దాటిందంటే చాలు బయటికి రాలేని పరిస్థితి. ఇటీవల ఓ మహిళను పాము కరవడంతో ఆసుపత్రిలో చికిత్స చేయించినట్లు స్థానికులు తెలిపారు.


చదువుల రామయ్య కాలనీలో రోడ్డు దుస్థితి

వసతులు కల్పించాలి



కాలనీలో వసతులు కల్పించాలి. తాగునీరు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఉదయం దూరానికి వెళ్లి నీరు తెచ్చుకోవడంతో చిన్నారులను సమయానికి పాఠశాలకు పంపలేకున్నాం. ప్రజాప్రతినిదులు, అధికారులు స్పందించి కాలనీ సమస్యలు పరిష్కరించాలి.

– సుధాదేవి, స్థానికురాలు

రేషన్ బియ్యం వాహనం రాదు..



మా కాలనీ ఊరికి దూరంగా ఉంది. దీంతో రేషన్ బియ్యం వాహనం కూడా రావడం లేదు. ఒకవేళ తెచ్చుకుందా మని బయటికి వెళితే అక్కడ రేషన్ బియ్యం ఇవ్వకుండా అయిపోయాయని చెబుతున్నారు.

– సరోజమ్మ, స్థానికురాలు

అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి



కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి. ఏదైనా అనారోగ్య సమస్య వస్తే సుమారు రెండు కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుంది. కనీసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పా టు చేయాలి. కాలనీకి వచ్చే దారిలో రాత్రి సమయాల్లో మందుబాబుల ఆగడాలను భరించలేకపోతున్నాం. రాత్రి ఏడు దాటిందంటే మహిళలు కాలనీలోకి వచ్చే పరిస్థితి లేదు.

– బీసన్న, స్థానికుడు

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాసులను ఆహ్వానించునట్లు ప్రిన్సిపాల్ విక్టర్ సామేల్ తెలిపారు. బుధవారం మాట్లాడుతూ మార్చి 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీ, ఓసీలకు దరఖాస్తు రుసుం రూ.150లు, ఎస్సీ, ఎస్టీలకు రూ.75లు ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఆంజనేయస్వామికి వెండి గొడుగులు


వెండి గొడుగులు

తుగ్గలి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడిబండలో ఆంజనేయస్వామికి హైదరాబాద్ శ్రీరాములు, ఈరమ్మ దంపతులు వెండి గొడుగులను అందించారు. మదనంత పురం గ్రామానికి చెందిన వీరు కేజీ వెండి గొడుగులను టీడీపీ సీనియర్ నాయకులు, ఆలయ ధర్మకర్త అప్పా వేణుగోపాల్‌కు అందజేశారు. పూజారి ఫక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి


పడిపోయిన పార్టీ పోల్‌ను పరిశీలిస్తున్న నాయకులు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జెండా కట్టను ధ్వంసం చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజ్ గౌడ్, ఉత్తర మండల అధ్యక్షుడు మహాదేవ డిమాండ్ చేశారు. పట్టణంలోని విజయనగర కాలనీలో దుండగులు ధ్వంసం చేసిన పార్టీ జెండా కట్టను బుధవారం నాయకులు పరిశీలించి, త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్టీ అభివృద్ధిని, ఎమ్మెల్యే పార్థసారధి ఎదుగుదలను ఓర్చుకోలేని ఈ చర్యకు పాల్పడినట్లు భావిస్తున్నామని తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శులు రాము, రామకృష్ణ, చంద్ర, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్ కుమార్, ఓబీసీ మోర్చా నాయకులు వీరేష్, రాజు, పరమేష్ కాశీ పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి


హాలహర్విలో మాట్లాడుతున్న వీఆర్‌పీఎస్ నాయకులు

హాలహర్వి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీల జాబితాలోకి చేర్చాలని వీఆర్‌పీఎస్ కార్యదర్శి రామాంజినేయులు డిమాండ్ చేశారు. బుధవారం హాలహర్విలో వాల్మీకుల ఐక్యత సమావేశం నిర్వహించారు. మార్చి 3న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని, శాంతియుతంగా ఉద్యమాలు చేసి ఎస్టీ జాబితాలోకి చేర్చే వరకు పోరాటం చేయాలన్నారు. నాయకులు అర్థగేరి శ్రీనివాసులు, క్రిష్ణ పాల్గొన్నారు.

ప్రజలకు మంచి రోజులు

మద్దికెర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రాకతో ప్రజలకు మంచి రోజులు వచ్చాయని జిల్లా టీడీపీ సాధికారికత కన్వీనర్ ఎస్.లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షులు గడ్డం రామాంజులు, మైనార్టీ నాయకులు సాయినగర్ బాషా న్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. పేదలకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం జీవో విడుదల చేయడం మంచి పరిణామమన్నారు.

ఘనంగా మహా శివరాత్రి

- పూజలు చేసిన భక్తులు
- రాత్రి జాగరణ
- భక్తులకు అన్నదానం చేసిన నిర్వాహకులు


ఆదోనిలో కొండపై హోమం చేస్తున్న అర్చకులు


పత్తికొండ మండిగిరి కొండపై భక్తుల జాగరణ


మద్దికెర సిద్ధేశ్వరస్వామి రథం లాగుతున్న భక్తులు

ఆదోని/ ఆదోని అగ్రికల్చర్ ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలయాల్లో మహా శివరాత్రి వేడుకలు నిర్వహించారు. బుధవారం చంద్రమౌళీశ్వర ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి నగర్, ప్రభాకర్ థియేటర్ పక్కన శివాలయంలో భక్తులు వేకువజాము నుంచే బారులు తీరారు. ఆలయాలవద్ద క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అభిషేకాలు, బిల్వార్చనలు, విశేష పూజలు, వేద పండితుల ఆధ్వర్యంలో వేదమంత్రోచరణ నడుమ వైభవంగా జరిగాయి. ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వాల్మీకి నగర్‌లో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు పూజలు నిర్వహించారు. గణేష్ సర్కిల్‌లో రథోత్సవం అనంతరం ప్రత్యేక వేడుకలు జరిగాయి. శివ పార్వతి వేషధారణతో పలువురిని ఆకట్టుకున్నారు.

కిటకిటలాడిన శివాలయాలు

హొళగుంద: సిద్దేశ్వర స్వామి ఆలయంతో పాటు మండలంలోని దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయం, గజ్జెహళ్లి పోతు లింగేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భకులతో కిటకిటలాడాయి.

వైభవంగా శివరాత్రి వేడుకలు

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం బురుజుల, బుగ్గ సంగమేశ్వరుడి ఆలయాల్లో మహాశివరాతి పూజలు చేశారు. మెయిన్ బజారులోని రేవణ సిద్దేశ్వరస్వామి రథోత్సవం బుదవారం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం విగ్రహాలను పల్లకిలో ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. సాయంత్రం రథాన్ని లాగారు.

దేవనకొండ: మండలంలో శివరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. విద్యుత్ దీపాలంకరణ చేశారు.

హాలహర్వి: మండలంలోని శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం అన్ని గ్రామాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో రాత్రంతా భజనలు, జానపద గేయాలతో అలరించారు.

ఘనంగా కుంభాభిషేకం

అదోని అగ్రకల్చర్: పట్టణ శివారులోని కొండపై శాంత మల్లేశ్వర స్వామి ఆలయంలో కళశానికి బుధవారం కుంభాభిషేకం చేశారు. మహాశివరాత్రి పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ స్వామి బ్రహ్మచారి నారాయణ చైతన్య, పురోహితులు రాజా శర్మ, అధ్యక్షుటు ప్రతాప్, కార్యదర్శి రఘునాథ్, కోశాధికారి రమేష్, పెద్దలు విట్టా రమేష్, మోహన్ రెడ్డి, విట్టా మురళి, జగదీష్, శ్రీనివాసులు రాముడు పాల్గొన్నారు.

బ్రహ్మగుండంలో వేడుకలు

వెల్దుర్తి టౌన్: పట్టణ సమీపంలోని బ్రహ్మగుండంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు కామేశ్వరి సహిత బ్రహ్మగుండేశ్వరస్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు బస్సులను ఏర్పాటు చేశారు.

ప్రముఖుల పూజలు

పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడు, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, రమాకాంత్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, బలరామ్‌గౌడ్, సూదెపల్లి జయరాముడు తెలుగు యువత మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం కేఈ మాదన్న జ్ఞాపకార్థం అల్పాహార విందును ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే కర్నూలు సివిల్ న్యాయాధికారి పి.మల్లేశ్వరి కుటుంబ సభ్యులతో అభిషేకాలు చేశారు.

ఆలూరు: మండలంలోని అన్ని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కోట వీధిలోని భీమ లింగేశ్వర స్వామి దేవాలయంలో ఆలూరు జూనియర్ సివిల్ న్యాయధికారి హేమ, జడ్పీటీసీ ఎరూర్ శేఖర్ పూజలు నిర్వహించారు. ఆలూరు. హలేబీడులో 101 శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బోడిబండలో జాగరణ

తుగ్గలి: బోడిబండలో తిమ్మగురుడు, ఫక్కీరప్పస్వాములు, శివలిం గానికి పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి రాత్రి జాగరణ చేశారు. అలాగే భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్ర మాలు, భజనలు ఏర్పాటు చేశారు. ధర్మకర్తలు అప్పా వేణుగోపాల్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండలో కిక్కిరిసిన శివాలయాలు

పత్తికొండ టౌన్: పట్టణంలో బుధవారం శివరాత్రి వేడుకలు వైభవంగా చేశారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బైపాస్ శివాలయం, రెడ్డిబావి శివాలయం, మండిగిరి రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే రుద్రాభి షేకాలు, అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం తీర్థప్రసాదాలను అందజేశారు. మండిగిరి రామలింగేశ్వరస్వామి ఆలయంలో గ్రామ ప్రజలే కాకుండా వివిద ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి జాగరణ చేశారు.


వెల్దుర్తి : బ్రహ్మగుండంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు


ఆదోనిలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు


దేవనకొండలో మహిళలు..

చెరువుల శిథిలావస్థ..

- మరమ్మతులు చేయాలని రైతుల వినతి


ముళ్లపొదలతో నిండిన కరివేముల చెరువు

దేవనకొండ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో మైనర్ ఇరిగేషన్ కింద 3 చెరువులు,మరో చిన్నపాటి చెరువులు 22 ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్ కింద కరివేములు, నేలతలమర్రి, మాచాపురం చెరువులు ఉన్నాయి. చెరువుల్లో నీటి నిల్వతో సమీప పొలాల్లో భూగర్భ జలాలు అభివృద్ధి చెందడంతో పాటు సాగు, తాగునీరు అందుతుంది. అయితే గత ప్రభుత్వం చెరువుల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో అవి శిథిలావస్థకు చేరాయి. కట్టలకు పగుళ్లు ఏర్పడ్డాయి, తూములు మూసు కుపోయి నీరు పారడం లేదు. మండలంలోని కరివేముల, దేవనకొండలోని రెండు చెరువులకి మాత్రమే హంద్రీనీవా నీరు వస్తోంది. మరమ్మతులు చేస్తే మరో ఐదు చెరువులను హంద్రీనీవా నీటి నింపుకునే ఆవకాశం ఉంటుంది.

కాలువల్లో పూడిక..

చెరువు నుంచి పొలాలకు వెళ్లే కాలువలో పూడిక తీయకపోవడంతో నీరు అందడం లేదు. కాలువలకు మరమ్మతులు చేసి నీరు పారేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి



ఐదేళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో గట్టు, తూములు దెబ్బతిన్నాయి. ముళ్ల పెరిగిపోయింది. కాలువలు కూడా పూడికతో నిండాయి. నీరు అందడం లేదు. అధికారులు స్పందించి మర్మమతులు చేయించాలి. **- అబ్బా రంగన్న ,కరివేముల**

మరమ్మత్తులకు ప్రతిపాదనలు

మండలంలో 12 చెరువుల మరమ్మతులకు రూ.2.50 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు నిర్వహిస్తాం.- **సోమన్న, ఏఈఈ, దేవనకొండ.**

800 లీటర్ల డీజిల్ దొంగతనం?

దేవనకొండ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఆపి ఉన్న వాహనాల్లోకి 800 లీటర్ల డీజిల్ చోరీకి గురైనట్లు డ్రైవర్లు షరీఫ్ బాషా, మద్దిలేటి, కరుణాకర్, వెంకటరమణ తెలిపారు. బాధితుల కథనం మేరకు వివరాల హైదరాబాద్, నంద్యాల నుంచి బళ్లారికి వెళుతూ ... మండలంలోని ఈదుల దేవరబండ వద్ద ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద మంగళవారం అర్ధరాత్రి దాటాక డ్రైవర్లు విశ్రాంతి తీసుకున్నారు. ఉదయం లేచి చుడగా వాహనాల డీజిల్ ట్యాంకుల మూతలు తెరచి వుండటంతో చోరీకి గురైనట్లు గ్రహించారు. రూ.20 వేల నష్టం వచ్చిందని డ్రైవర్లు అవేదన వ్యక్తం చేశారు.

మాజీ ఎంపీటీసీ మృతి

ఆస్పరి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కైరుప్పల మాజీ ఎంపీటీసీ చిన్న వీరభద్రప్ప బుధవారం మృతి చెందాడు. 1996 లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీటీసీగా గెలుపొంది గ్రామానికి ఉత్తమ సేవలు అందించారు. భార్య గోవిందమ్మ ఉంది.

ఇదేం తీరు


కాలువలో పడేసిన చెట్ల కొమ్మలు

ఆదోని రైల్వేస్టేషన్, కోర్టు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లకు అడ్డువస్తున్నాయని చెట్ల కొమ్మలను తొలగించారు. అయితే విద్యుత్ అధికారులు వాటిని అక్కడ నుంచి తరలించకుండా కాలువల్లో పడేసి వెళ్లిపోయారు. దీంతో మురుగు ముందుకు పోవడం లేదు. విద్యుత్ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. **- ఆదోని**

ప్రాణాలు కాపాడారు

- ఎల్లెల్సీలో కొట్టుకుపోతున్న ఇద్దరిని కాపాడిన హొళగుంద యువకులు


ఇద్దరి ప్రాణాలను కాపాడిన హొళగుంద గ్రామస్థులు

హొళగుంద, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్నానం చేసేందుకు ఎల్ఎల్‌సీ కాలువలో దిగి కొట్టుకుపోతున్న ఇద్దరిని స్థానికులు కాపాడారు. వివరల మేరకు..కర్ణాటక రాష్ట్రం సిరుగుప్పకు చెందిన ఇద్దరు యువకులు ఓ మజీద్‌లో పెయింట్ వేసేందుకు బుధవారం వచ్చారు. సాయంత్రం పనులు ముగించుకొని స్నానం చేసేందుకు ఎల్ఎల్‌సీ కాలువలోకి దిగారు. వారికి ఈత రాకపోడంతో నీటిలో పడి కొట్టుకుపోతూ గట్టిగా కేకలు వేశారు. అటుగావస్తున్న హొళగుందకు చెందిన పింజారి సిద్దిక్, మౌలా, సమీర్ గమనించి హుటాహుటిని కాలువలోకి దూకి యువకులను కాపాడారు. తృటిలో ఇద్దరి ప్రాణాలు పోయేవని కాపాడిన వారిని గ్రామస్థులు అభినందించారు.

వాటర్‌షెడ్ పనులను వినియోగించుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ పనులను రైతులు వినియోగించుకోవాలని అడిషనల్ పీడీ మాధవిలత తెలిపారు. బుధవారం మండలంలోని కందనాతి గ్రామంలో ప్రాజెక్టు అధికారి వలిబేగ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం రైతుల పొలాల్లో చెక్‌డ్యాంలు, ఫారంపాండ్స్, నీటి కుంటలను ఏర్పాటు చేస్తుందన్నారు. పొలాల్లో నీటి సరఫరాకు వీలుగా ఆయిల్ ఇంజన్లను, పైపులను అందజేస్తుందన్నారు.

పత్తికొండ చెరువుకు హంద్రీ నీవా నీరు


బుగ్గవంక ద్వారా పత్తికొండ చెరువుకు చేరుతున్న హంద్రీ నీవా నీరు

పత్తికొండ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ చెరువుకు బుధవారం హంద్రీనీవా నీరు చేరింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి 68 చెరువులకు నింపేందుకు ప్రణాళికలు రూపొందించి 60శాతం పనులను పూర్తిచేశారు. అనంతరం 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో పనులు నిలిచిపోయాయి. చివరగా ఎన్నికల అస్త్రంగా చెరువులకు నీరునింపేందుకు వైసీపీ ప్రభుత్వం ప్రారంభించినా సాంకేతిక లోపాలతో చెరువులకు నీరుచేరలేదు.

కాగా 2024లో టీడీపీ తిరిగి అధికారంలోకి రావడం శ్యాంబాబు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో చెరువలను నింపేం దుకు నడుం బిగించారు. పనులు పూర్తి కావడంతో బుగ్గవంక ద్వారా చెరువుకు నీరుచేరింది. టీడీపీ నాయకులు శ్రీదర్‌రెడ్డి, తిరపాల్‌నాయుడు, మీరాహుసేన్, హుల్తెన్న హంద్రీనీవా నీటిని పరిశీలించారు.

అందుబాటులో 24 గంటల వైద్య సేవలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- సూపరింటెండెంట్ డా.బాలచంద్రారెడ్డి



వెల్దుర్తి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్లస్టర్ వైద్యశాలలో 24 గంటల సేవలు అందుబాటులో ఉంటాయని సూపరిండెంట్ డాక్టర్ బాలచంద్రారెడ్డి అన్నారు.

ప్రశ్న: రోజుకు ఓపీకి ఎంత మంది రోగులు వస్తున్నారు?
జవాబు: దాదాపు 300 మంది దాకా వస్తున్నారు.
ప్రశ్న: ఆసుపత్రి స్థాయి ఏమిటి. ఎంత మంది వైద్యులు సేవలం దిస్తున్నారు?
జవాబు: ప్రాథమిక స్థాయి నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రం గా రూ.6 కోట్లతో 30 పడకల ఆసుపత్రిగా ప్రభుత్వం అభివృద్ధి చేసింది. చిన్నపిల్లల వైద్యుడు, స్త్రీవ్యాధి నిపుణులు, జనరల్ మెడిసిన్, అనస్తీషియా, హోమియోపతి, దంత వైద్యులు అందుబాటులో ఉన్నారు. జనరల్ సర్జన్ కొరత ఉంది.
ప్రశ్న: గర్భిణులకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారా?
జవాబు: ప్రతి నెలా 9వ తేదీన గర్భిణులకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేసి రక్తపరీక్షలు, స్కానింగ్ చేస్తున్నాం. తల్లీబిడ్డ క్షేమానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కౌన్సెలింగ్ ఇస్తున్నాం.
ప్రశ్న: ఆరేషన్లకు సౌకర్యం ఉందా?
జవాబు: ఆపరేషన్ల సౌకర్యం ఉంది. అయితే సహజ ప్రసవాలకే ప్రాధాన్యం ఇస్తున్నాం. హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసుల్లో మాత్రమే సిజేరియన్లు చేస్తున్నాం. నెలకు 40 సహజ కాన్పులు, 10 దాకా సీజేరియన్లు చేస్తున్నాం.
ప్రశ్న: పిల్లల చికిత్సలు ఏవి?
జవాబు: పుట్టిన పిల్లల నుంచి పెద్ద పిల్లల దాకా అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందిస్తున్నాం. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.
ప్రశ్న: ల్యాబ్, ఎక్స్‌-రే ఉందా.?
జవాబు: అన్ని రకాల రక్తపరీక్షలు చేస్తున్నాం. ఎక్స్‌-రే, బ్లడ్ స్టోరేజ్ కూడా అతి త్వరలో అందుబాటులోకి రానున్నాయి.
ప్రశ్న: కుక్క, పాముకాటుకు ఇంజెక్షన్లు ఉన్నాయా?
జవాబు: యాంటీ రేబిస్, యాంటీ వీనమ్, కోతి బాధితులకు ఇంజక్షన్లు ఉన్నాయి.
ప్రశ్న: గుండెపోటు చికిత్స అందిస్తున్నారా?
జవాబు: ప్రభుత్వం 'స్టెమీ' చికిత్స విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. రూ.36 వేల 'టెనెక్టేప్లస్' ఇంజెక్షన్ ఆసుపత్రిలో ఉంది. గుండెపోటు వచ్చిన గంటలోపు రోగిని తీసుకువస్తే ఈ ఇంజక్షన్ వేసి ప్రాణాలు కాపాడవచ్చు.



నందవరం మండలం గురుజాలలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మంత్రాలయం రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ముగిసిన దేవర



బీర లింగేశ్వరస్వామి పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

మంత్రాలయం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో వెలసిన బీర లింగేశ్వర స్వామి దేవర ఉత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. బుధవారం తెల్ల వారుజాము నుంచి యాదిగిరప్ప, వన్నికెరప్పలను పల్లకిలో ఏర్పాటు చేసి గ్రామ వీధుల గుండా ఊరేగించారు. పల్లకి ముందు బీరప్పడోళ్ళు, మేళతాళాలు, భాజాభజంత్రీలు, గొరవయ్యల నృత్యాలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. మూడురోజులుగా జరిగిన బీరప్ప ఉత్సవాలు జరుపుకున్నారు. దీంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల భక్తులతో కిక్కిరిసింది.

వాటర్‌షెడ్ పనులను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల పొలాల్లో చేపడుతున్న వాటర్‌షెడ్ పనులను సద్వినియోగం చేసుకోవాలని వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ మాధవీలత అన్నారు. బుధవారం మండల పరిధిలోని కందనాతి గ్రామంలో ప్రాజెక్టు అధికారి (పీవో) వలిబేగ్ ఆధ్వర్యంలో రైతులకు వాటర్‌షెడ్ పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ పీడీ మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించి వారు పంటలను సాగుచేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం రైతుల పొలాల్లో చెక్‌డ్యాంలు, ఫారంపండ్స్, నీటి కుంటలను ఏర్పాటు చేస్తుందన్నారు. అలాగే నీటిని పొలాల్లోకి వదులుకునేందుకు వీలుగా ఆయిల్ ఇంజన్లను, పైపులను అందజేస్తుందన్నారు. అర్హులైన ప్రతి రైతు తమ పొలంలో వాటర్‌షెడ్ పనులు చేయించుకొని పంటలను సాగుచేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఇప్పటి వరకు ఆరు చెక్‌డ్యాంలు, 170 ఫారంపండ్స్, నాలుగు పెద్ద నీటి కుంటలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే రైతులకు 31 ఆయిల్ ఇంజన్లు, 16పైపులు, 110 తార్పాలిన్లు, డైవాన్ పంపులను ఇచ్చామన్నారు. అవసరం ఉన్న రైతులు వాటర్‌షెడ్ అధికారులను సంప్రదిస్తే వారి పొలాల్లో నీటి కుంటలతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న ఆయిల్ ఇంజన్లను అందజేస్తామన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఈ పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ కేశన్న, టీడీపీ సీనియర్ నాయకులు హనుమంతు, రైతులు పాల్గొన్నారు.

పూలచింతలో పూజలు చేసిన ఎమ్మెల్యే

నందవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పూలచింతలో బండేగురుస్వామి ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఉపపీఠాధిపతి బండేగురు స్వామి నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. నియోజకవర్గంలో ప్రజలు, రైతులు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్థులతో పాటు భక్తులు పాల్గొన్నారు.



ఉపపీఠాధిపతి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే బీవీ

కలుగొట్లలో బండలాగుడు పోటీలు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని టీడీపీ నాయకులు వృషభాల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో తొమ్మిది జతల వృషభాలు పాల్గొన్నాయి. కలుగొట్లకు చెందిన గొల్ల హనుమంతురావు వృషభాలు మొదటి బహుమతి రూ.10 వేలు, కలుగొట్లకు చెందిన మాచాపురం నరసింహుడు వృషభాలు ద్వితీయ బహుమతిని రూ.8వేలు, కలుగొట్లకు చెందిన మద్దిలేని వృషభాలు తృతీయ బహుమతిని రూ.6వేలు, కలుగొట్లకు చెందిన కటికె ఆశన్న వృషభాలు చతుర్థ బహుమతిని రూ.4వేలు, కె. నాగలాపురానికి చెందిన కుమ్మరి శ్రీను వృషభాలు పంచమ బహుమతి రూ.2లను కైవసం చేసుకున్నాయి. ఎద్దుల యజమానులకు కలుగొట్ల టీడీపీ సీనియర్ నాయకులు కొండన్నగౌడు, నరసన్నగౌడు, దేవగౌడు, సురేంద్రరెడ్డి, గొల్ల నరసప్ప బహుమతులు ప్రదానం చేశారు. పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Yemmignaur. I issue the following notice to general public. My Clients intends to grant loan to **Sri Kondapuram Quibla Hussain, S/o K. Athaullah Sab, R/o. H.No: 18/502, Quibla Quarters, yemmiganur Town & mandal, Kurnool District,** by keeping the below mentioned property of him as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be infor med to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

House site bearing plot no: 1-E, Situated in Sy.No.245/2 pyki, yemmiganur village, within the limits of yemmiganur sub registration district and district registration of kurnool, Bounded as follows: **East:** Land of Y.L.Gadilinganna Goud, **West:** Plot No:2, **North:** Plot No: 1-F Anjinaiah site, **South:** Plot No: 1-D Yasmin Banu house. **Measure ments:** Towards eastern side: 20 feet, towards Western side 20 feet, towards Northern side: 43.90 feet. towards Southern side: 40.6 feet **Total Extent:** 842.4 Sq. Feet or 93.88 Sq.Yards.

C.SOMASEKHAR, Advocate, Adoni. Cell: 94900 00338

నేడు తిమ్మప్పదూత రథోత్సవం

మంత్రాలయం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని గురువారం తిమ్మప్పదూత రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఇందు కోసం నిర్వాహకులు రథోత్సవ ఏర్పాట్లు చేపట్టారు. తిమ్మప్పదూతను పల్లకిలో ఊరేగించి ఈశ్వరుని చిత్రపటాలను రథంపై ఏర్పాటు చేసి ఊరేగించనున్నారు. మంత్రాలయం సీఐ రామాంజులు పోలీసు బందోబస్తును నిర్వహిస్తున్నారు. జడ్పీటీసీ గోవిందమ్మ, సర్పంచ్ మేకల సుజాత, ఎంపీటీసీలు మజ్జిగ నరసమ్మ, కోసిగి జయలక్ష్మి ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఘనంగా శివరాత్రి వేడుకలు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని నీలకంఠేశ్వర స్వామి, మార్కండేశ్వర స్వామి, కోటా ఈశ్వర స్వామి, సంజీవనగర్, దత్తాత్రేయ స్వామి, పాత ఆంజనేయ స్వామి, సుంకలమ్మ దేవాలయం, మాత్రాల తిమ్మప్ప దేవాలయం, సుశీలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారికి క్షీరాభిషేకం, రుద్రాభిషేకాలు చేపట్టారు. దత్తాత్రేయ దేవాలయంలో జ్యోతిర్లింగాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహాశివరాత్రి జాగారణ సందర్భంగా ఆలయాలలో రాత్రంతా భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎమ్మిగనూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణంలోని తేరు బజారులో వెలసిన మార్కెండేయస్వామి దేవాలయం దగ్గర వైభవంగా దీపోత్సవాన్ని నిర్వహించారు. పట్టణ పద్మశాలి బహుత్తమ సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో మహిళా భక్తులుపెద్ద ఎత్తున తరలి వచ్చి దీపాలను వెలిగించడంతో ఆ ప్రాంతమంతో శోభాయమానంగా మారింది. లింగాకారం, విఘ్నేశ్వరుడు, ఓమాకారం, స్వస్తికారంలో పూలను అలకరించి అందులో దీపాలను వెలిగించిన దృశ్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. మార్కెండేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వీవర్స్ కాలనీలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వాహకులు దీపోత్సవాన్ని నిర్వహించారు. అలాగే స్వామి వారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు విశ్వనాథ్‌రమేష్, పోలె శీను, శాసం శివదాసు, పోలి ప్రసాద్, ఆడిమి ఉరుకుందు, పట్టా నాగరాజు, రంగస్వామి, కాంచానం వీరేష్, ఆలయ అర్చకులు బిజ్జెనాగరాజు, శ్రీధర్‌స్వామి, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్/పెద్దకడుబూరు: కైలాసవాస వాసుడి మహారాత్రి వేడుకలను బుధవారం ఎమ్మిగనూరు మండలంలోని సిరాల దొడ్డి, కడివెళ్ల, కందనాతి, మసీదుపురం, మాస్‌మాన్‌దొడ్డి, రాళ్లదొడ్డి, తదితర గ్రామాలతో పాటు పెద్దకడుబూరు మండలంలోని దొడ్డిమేకల, పెద్దకడుబూరు పీకలబెట్ట తదితర గ్రామాల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్దకడుబూరు, ఎమ్మిగనూరు మండలంలోని ఆయా గ్రామాల్లో భక్తులు శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయం, సాయిబాబా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి సమయంలో శివపార్వతులకు కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం రాత్రి గురువారం తెల్లవారు జాము వరకు మహిళలు, పురుషులు, చిన్నారులు జాగారం చేసి భజనలు చేశారు.

కౌతాళం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని మేళిగనూరు శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం, ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం, ఎరిగేరి పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయం, కౌతాళంలోని త్రయంబకేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అన్ని శివాలయాల్లో శివనామస్మరణతో మార్మోగాయి. ఆయా ఆలయాల్లో భక్తులు రాత్రి జాగరణ చేశారు.

మంత్రాలయం: మంత్రాలయంలో మహాశివరాత్రి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం ఉదయం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో గర్భగుడి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో వెలసిన శివలింగానికి పీఠాధిపతి సుబుధేంద్రర్థులు, రాజాఎస్ అప్రమే యాచార్ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, నిర్మల విసర్జనం నిర్వ హించారు. మహాశివరాత్రి పురస్కరించుకుని రాఘవేంద్రస్వామి బృందా వనానికి విశేష పూజలు చేసి సంస్థాన పూజ చేశారు.

● మంత్రాలయం, మాధవరం, రాంపురం, రచ్చుమర్రి, చిలకలడోన, వగరూరు, తిమ్మాపురం, చెట్నహళ్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. మంత్రాలయం పాత ఊరులో వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు బిల్వార్చన, రుద్రాభిషేకం చేసి బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించారు. మాధవరం తుంగభద్ర నదిలో వెలసిన రామలింగేశ్వరస్వామికి, నంది విగ్రహాలకు ప్రత్యేక పుష్పాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. జాగారణ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు చేస్తూ ఉపవాసం చేశారు.

గోనెగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం శివరాత్రి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. భక్తులు ఉదయమే తుంగభద్రనది జలాలో పుణ్యస్నానాధులు ఆచారించి శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో స్వామి వారిని అలంకరించారు. రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ, మహామంగళ హారతి ఇచ్చారు. వీవర్స్‌కాలనీలో ఉన్న శివాలంలోని నీలంకఠేశ్వరస్వామికి భక్తులు పెద్ద ఎత్తున సాముహిక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం గోనెగండ్లలోని ఈశ్వరదేవాలయంలో వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్య స్వామి శివపార్వతులకు కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం పలు గ్రామాలలో శివారాత్రి సందర్భంగా రాత్రి జాగరణ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నాటకాలు, భజనలు చేపట్టారు.

హెచ్ కైరవాడిలో ప్రభోత్సవం: గోనెగండ్ల మండలం హెచ్ కైరవాడి గ్రామంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం భక్తులు పార్వతి, పరమేశ్వర ప్రభోత్సవం నిర్వహించారు. గ్రామంలోని ఈశ్వర దేవాలయం నుంచి పురవీధుల గుండా ప్రభోత్సవం సాగింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతకు ముందు శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. కుంకుమ అర్చన, అకుపూజ, మహా మంగళహారతి చేశారు. గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నందవరం: ప్రసిద్ధ శైవక్షేత్రమైన గురుజాల రామలింగ్వేర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు బుధవారం శినామస్మరణంతో మారుమోగింది. ఉదయం నుంచే భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు రావడంతో ఆలయం కిక్కిరిసింది. అర్చకులు హంపిస్వామి ఆధ్వర్యంలో ఆలయంలో యాగమంట ప్రవేశం, గణపతిపూజ, రుత్వికరణం, కలశ స్థాపన, అంకురార్పన, శతరుద్రాభిషేకం, కుంకుమార్చన, లింగోద్భవ సమయంలో క్షీరాభిషేకం, స్వామివారి కల్యాణోత్సవంతో పాటు ప్రభోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఇసుక లింగానికి, పార్వతీ దేవి, మట్టులింగం, పార్థలింగం, బీమలింగం, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐలు మధుసూదన్, శ్రీనివాసులు, నందవరం ఎస్ఐ శ్రీనివాసులు, ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు: స్వామిని దర్శించుకునేందుకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి రాగా ఆలయ మర్యాదలతో ఆలయ అర్చకులు హంపీ స్వామి, టీడీపీ నాయకులు శివారెడ్డి శాలవ కప్పి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ మధుసూదన్, తహసీల్దారు శ్రీనివాసులు, రజనీకాంత్‌రెడ్డి, టీడీపీ జిల్లా నాయకులు దివాకర్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు రైస్‌మిల్ నారాయణరెడ్డి, జబ్బార్, గజేంద్రరెడ్డి, వహబ్ మాజీ చైర్మన్లు నరసింహారెడ్డి, గ్రామ నా యకుడు పరమేష్ వచ్చిన అతిథులను శాలువాలు కప్పి సన్మానించారు.



ఎమ్మిగనూరులో లింగాకారంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



సంజీవనగర్‌లో శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు



కౌతాళం: త్రయంబకేశ్వర స్వామి దేవాలయంలో బారులు తీరిన భక్తులు



విద్యుత్ దీపాలతో లింగాకారం



గోనెగండ్లలో శివపార్వతులకు కల్యాణం నిర్వహిస్తున్న పీఠాధిపతి



రాఘవేంద్రస్వామి మఠంలో శివలింగానికి పూజలు చేస్తున్న రాజా ఎస్ అప్రమేయాచార్



మాధవరం తుంగభద్ర నదిలో శివాలయాన్ని అలంకరించిన దృశ్యం



ఎమ్మిగనూరులో దీపాలు వెలిగిస్తున్న యువతులు



స్వామివారి దర్శనానికి క్యూలో నిలబడిన భక్తులు



పూజల్లో పాల్గొన్న ఆలయ నిర్వాహకులు



హెచ్. కైరవాడిలో ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆదాయం ఫుల్.. అభివృద్ధి నిల్

కోసిగి ఆర్టీసీ బస్టాండులో మౌలిక వసతులు లేక ప్రయాణికుల ఇక్కట్లు



ఆర్టీసీ బస్టాండులో కుర్చీలు లేక నేలపై కూర్చున్న ప్రయాణికులు

కోసిగి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండుకు నెలకు రూ.లక్షల్లో ఆదాయం ఉన్నా.. అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో ఉంది. ఆదోని, ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోల నుంచి రెగ్యులర్‌గా ఎమ్మిగనూరు, ఆదోని ప్రాంతాలకు బస్సులు తిరుగుతున్నాయి. అలాగే కర్ణాటకలోని శిరిగుప్ప నుంచి రాయచూరు వరకు కర్ణాటక బస్సు కోసిగి బస్టాండు మీదుగా సర్వీసు నడుపుతోంది. రోజు కోసిగి బస్టాండు నుంచి వేలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. అయితే బస్టాండులో మాత్రం ప్రయాణికులు కూర్చోవడానికి కుర్చీలు లేవు. ఫ్యాన్లు లేక ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. నెలకు ఆర్టీసీ బస్టాండు చెందిన సుమారు 50కి పైగా షాపులు ఉన్నాయి. నెలకు రూ.లక్షల్లో ఆదాయం ఉన్నప్పటికీ బస్టాండులో ఎలాంటి మౌలిక వసతులు లేవని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు బస్టాండులోనే ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. ఎమ్మిగనూరు, ఆదోని డిపోల అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో స్థానిక బస్టాండ్‌లో సమస్యలు తిష్ట వేస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయానికి కోసిగి మండలం నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కోసిగి బస్టాండులోని సమస్యలు పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.



కోసిగి ఆర్టీసీ బస్టాండులో నిలిపిన ద్విచక్ర వాహనాలు

బస్టాండులో వసతులు కరువు



కోసిగి ఆర్టీసీ బస్టాండులో మౌలిక వసతులు లేవు. కనీసం కూర్చునేందుకు కుర్చీలు, ఫ్యాన్లు లేక ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. తాగునీరు లేకపోవ డంతో చాలా మంది ప్రయాణికులు స్థానిక హోటళ్లను ఆశ్రయిస్తున్నారు. నెలకు బస్టాండు నుంచి రూ.లక్షల్లో ఆదాయం ఉన్నా అభివృద్ధి మాత్రం చేయడంలేదు.

- ఎస్.వీరేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు